

కునుకు లేదు!

తినబుద్ధి కాదు!!

- భయాందోళనలో మూసీ పరీవాహక నిర్వాసితులు
- ఎప్పుడు ఎవరు వస్తారోననే ఆందోళన
- కాలనీలు, గల్లీల్లో వంతుల వారీగా గస్తీల నిర్వహణ
- కొత్త వ్యక్తులు వస్తే వెంటనే గుంపులుగా చేరుతున్న వైనం
- దంపతులిద్దరూ ఉద్యోగులైతే ఒకరు ఇంటివద్దే

'రివర్ బెడ్ మార్కు మీ ఇంటి వరకు వచ్చిందని కొందరు అంటుండగా, ఎహే.. వాళ్లతో పాటు ఇగో.. ఇలా పొడుగూతా ఉన్న ఇళ్లన్నీ పోతాయట..' అని మరికొందరు అంటుండడంతో స్థానికులు వణికిపోతున్నారు. ఇదిగో తోక అంటే.. అదిగో పులి.. అన్నట్లుగా తయారైంది మూసీ పరివాహక నిర్వాసితుల పరిస్థితి. మేం ఆరు నెలల క్రితమే రూ.10 లక్షలు పెట్టి ఇంటిని రెనోవేషన్ (ఆధునీకరణ) చేయించామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, తాము ఈ ఏడాది జనవరిలోనే గృహ ప్రవేశం చేశామని ఇంకొందరు బోరున విలపిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఇళ్లను కూల్చివేస్తే మా పరిస్థితి ఏంటని వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నిద్ర ఉండడం లేదని, తిండీ ఎక్కట్లేదని కొందరు వాపోతున్నారు.

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సుందరీకరణలో భాగంగా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్ జిల్లాలో 1,595, మేడ్చల్‌లో 239, రంగారెడ్డి జిల్లాలో 332 ఇళ్లను డ్రోన్ సర్వే ద్వారా నదీ గర్భం (రివర్ బెడ్)లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 2,166 నిర్మాణాల్లో 1150 వరకు నివాసగృహాలుండగా.. మిగతా 1016 కమర్షియల్ భవనాలు, షెడ్లుగా ఉన్నట్లు తెలిసింది. అయితే జిల్లాలో గుర్తించిన మొత్తం నిర్మాణాల్లో 80 శాతం మార్కింగ్ చేయగా.. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో స్థానికులు అడ్డుకోవడంతో ప్రక్రియ ఆగిపోయింది.

ఒకింత ఆందోళన..

మూసీనది ప్రక్షాళనలో భాగంగా వారం రోజుల క్రితం ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు రివర్‌బెడ్ (ఆర్‌బీ-ఎక్స్) మార్కింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. లంగర్‌హౌజ్, చాదర్‌ఘాట్, ఓల్డ్‌మలక్‌పేట్, ఆసిఫ్‌నగర్‌తో పాటు మేడ్చల్ జిల్లాలోని చైతన్యపురి, కొత్తపేట్‌లో నిర్వాసితులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. చైతన్యపురి డివిజన్‌లోని సత్యనగర్‌కాలనీకి చెందిన ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. అయితే అప్పటి నుంచి ఆయా ప్రాంతాల్లో భయానక వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా పట్టాభూముల్లో 100, 150 గజాల్లో ఇళ్లు కట్టుకున్న వారితోపాటు 350, 450 గజాల్లో బహుళ అంతస్తుల్లో ఇళ్లు కట్టుకున్న యజమానులు హడలిపోతున్నారు. రూ.లక్షలు, రూ.కోట్లు వెచ్చించి, బ్యాంకు రుణాలు తీసుకుని చేపట్టిన నిర్మాణాలను కూల్చేస్తే ఏంటి పరిస్థితని నెత్తీనోరు కొట్టుకుంటున్నారు.

ఉద్యోగ దంపతుల్లో ఒకరు ఇంటివద్దే..

మూసీనదికి దాదాపు వందమీటర్లకు పైగా తమ ఇళ్లు ఉన్నప్పటికీ, నదీగర్భం (రివర్‌బెడ్) లోనే చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారని పలువురు వాపోతున్నారు. అయితే పలు కాలనీల్లో కొంతమంది రోజంతా ఇంటివద్ద ఉంటూ మార్కింగ్ వేయకుండా అడ్డుకునేందుకు కాపలా కాస్తున్నారు. ఇదే సందర్భంలో కోర్టు నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకునేందుకు పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా ఉద్యోగ దంపతుల్లో ఒకరు సెలవులు పెట్టుకుని మరీ ఇంటి వద్ద ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. కాగా, జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)లు ఏర్పాటు చేసుకుని వంతుల వారీగా కాలనీలు, గల్లీల్లో తిరుగుతున్నారు. కొత్త వ్యక్తులు వచ్చిన వెంటనే ఒకరికొకరు సమాచారం చేరవేస్తూ అప్రమత్తమవుతున్నారు. మొత్తంగా మూసీ ప్రక్షాళన నిర్వాసితుల్లో గుబులు పుట్టిస్తోంది.

అపార్ట్‌మెంట్లు పోతాయని..

చైతన్యపురిలోని సత్యానగర్‌కాలనీ సమీపంలో దాదాపు 30 ఏళ్ల క్రితం నాటి అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అందులో దాదాపు 300పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇటీవల అధికారులు రివర్‌బెడ్ మార్కింగ్ సందర్భంలో ఆ వైపు కనీసం కన్నెత్తికూడా చూడలేదు. కాగా, అపార్ట్‌మెంట్‌వాసులు కూరగాయలు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లినా, వాకింగ్‌కు వెళ్లినా మీరు ఉండే ఇళ్లన్నీ రివర్‌బెడ్‌లో పోతాయని ఇతరులు చెబుతుండడంతో ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొంది. తమ అపార్ట్‌మెంట్ అందులో లేదని చెప్పినప్పటికీ ఇతరులు వాదనకు దిగుతుండడంతో వణికిపోతున్నారు. ఈ ప్రచారం దావానంలా అపార్ట్‌మెంట్లలోని నివాసముంటున్న అందరికి తెలియడంతో ఇటీవల అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తమ అపార్ట్‌మెంట్లు రివర్‌బెడ్‌లో ఉన్నాయా, లేవా.. అంటూ ఎవరిస్థాయిలో వారు అధికారులను ఆరా తీస్తున్నారు. రివర్‌బెడ్‌లో లేదంటూ కొందరు అధికారుల నుంచి సానుకూల సమాచారం అందుతుండడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ.. సమీప ఇతర నివాసితులు రోజువారీ చర్చలతో ఒకింత ఆందోళన చెందుతున్నారు.

824 నివాసాలు.. 149 కూల్చివేతలు

- ఇప్పటివరకు చర్యలు అంతంతమాత్రమే
- రివర్‌బెడ్‌లోని మొత్తం 1,595 నిర్మాణాల్లో.. 1,333 వరకు మార్కింగ్
- నిరసనలు, ఆందోళనలతో 262 చోట్ల ఆగిన ప్రక్రియ
- కమర్షియల్ భవనాల జోలికి వెళ్లేందుకు వెనుకంజ
- ప్రభుత్వ ఆదేశాల తర్వాతే ముందుకుసాగనున్న యంత్రాంగం



శంకర్‌నగర్‌లో కూల్చేసిన ఇళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణలో భాగంగా కూల్చివేతల ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు రివర్‌బెడ్ కింద గుర్తించిన మొత్తం నిర్మాణాల్లో 25 శాతం కూడా తొలగించలేదు. అయితే మూసీ మురికి నుంచి ఉపశమనం పొందాలంటే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్తే బాగుంటుందని రెవెన్యూ అధికారులు గంటలకొద్దీ కౌన్సిలింగ్‌లు ఇస్తున్నప్పటికీ చాలా మంది ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ఆపరేషన్ మూసీలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో నదీ గర్భం (రివర్‌బెడ్)లో మొత్తం 1,595 నివాసగృహాలు, కమర్షియల్ భవనాలు, నిర్మాణాలను గుర్తించారు. ఈ మేరకు మూసీ ప్రభావిత మండలాల్లో 1,333 వరకు మార్కింగ్ చేశారు. మిగతా 262 చోట్ల ఆర్‌బీ-ఎక్స్ గుర్తులు పెట్టేందుకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకుని నిరసనలు తెలియజేయడంతో వెనక్కి వచ్చారు. కాగా, మార్కింగ్ చేసిన వాటిలో 824 ఇళ్లు ఉండగా.. 771 వరకు దుకాణాలు, షెడ్లు, ఇతరత్రా కమర్షియల్ నిర్మాణాలున్నాయి. అయితే నివాసగృహాల్లో 149 వరకు మాత్రమే కూల్చివేయగా.. మిగతా యజమానులను ఒప్పించి పంపించేందుకు అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. తహసీల్దార్ల ఆధ్వర్యంలో ముగ్గురు, నలుగురు సిబ్బంది తమ పరిధిలోని బస్తీలకు వెళ్లి మాట్లాడుతున్నప్పటికీ డబుల్ బెడ్‌రూమ్‌లకు వెళ్లేందుకు ముందుకురావడం లేదని తెలుస్తోంది.

ఇది మా అడ్డా..!

సైదాబాద్, హిమాయత్‌నగర్ నాంపల్లి మండలాల్లోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన 193 మందిని మలక్‌పేట్‌లోని పిల్లిగుడిసెలు, జియాగూడ, ప్రతాపసింగారం, జంగంమెట్‌లోని రెండు పడకల గృహసముదాయానికి తరలించారు. అయితే నాంపల్లి, బహదూర్‌పురా, ఓల్డ్ మలక్‌పేట్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో తమ తాత, ముత్తాతల నుంచి వారసత్వంగా కొనసాగుతున్న దుకాణాలు, కార్ఖానాలను, వ్యాపార సముదాయాలను వదిలి వెళ్లేందుకు యజమానులు ముందుకురాని పరిస్థితి నెలకొంది. తమ నిర్మాణాలకు రివర్‌బెడ్ మార్కింగ్ వేస్తే బాగుండదని, ఇది తమ అడ్డా.. అంటూ అధికారులను బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. వారం రోజుల క్రితం ఓల్డ్ మలక్‌పేట్‌లోని శంకర్‌బస్తీలో ఉన్న

మిగతా 8వ పేజీలో..

తెలంగాణలో మరో నియంత పాలన



- చార్మినార్ వద్ద బతుకమ్మ వేడుకల్లో డీకే అరుణ

చార్మినార్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఓ నియంత ప్రభుత్వం పోయి మరో నియంత ప్రభుత్వం రాజ్యమేలుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు, చార్మినార్ వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. హైకోర్టు అనుమతి తెచ్చుకొని బతుకమ్మ పండుగ నిర్వహించుకోవాల్సి రావడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని, మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో రాష్ట్రంలో మహిళలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఇప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా మహిళలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్, తెలంగాణ మహిళ మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ఉమా మహేంద్ర, కునాల్ రావు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు



వేడుకల్లో పాల్గొన్న వనతి శ్రీనివాసన్, తదితరులు



జోరు వాన

- మెహిదీపట్నంలో 5 సెంటీమీటర్లు నమోదు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షం దంచికొడుతోంది. ఉరుములు, మెరుపులాంటివి లేకుండానే కొన్నిప్రాంతాల్లో అకస్మాత్తుగా కురుస్తున్న వానతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రోడ్లపై వెళ్తున్న వాహనదారులు ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకుని నరకయాతన పడుతున్నారు. దక్షిణ బంగాళాఖాతం వద్ద ఎగువ ప్రాంతంలో ఏర్పడిన ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీంతో నగరంలో శుక్రవారం ఉదయం వాతావరణం చల్లగా మారింది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరద ఉప్పొంగింది. పలు ప్రాంతాల్లో దాదాపు అరగంటపాటు పడిన వర్షంతో వాహనదారులు తడిసి ముద్దయ్యారు. అయితే రాత్రి 9 గంటలు దాటిన తర్వాత మరోసారి వరుణుడు దంచికొట్టాడు. 20 నిమిషాలపాటు కురిసిన

మిగతా 8వ పేజీలో..

మిశ్రమ వాతావరణంతో

వైరస్ ముప్పు



- ఎండ అంతలోనే వాన
- పౌరుల ఆరోగ్యంపై ప్రభావం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు వేడిగా ఉన్న వాతావరణం అకస్మాత్తుగా చల్లగా మారిపోతోంది. సాయంత్రానికి వర్షం కురుస్తోంది. వాతావరణంలో అసాధారణ మార్పులను తట్టుకోలేక శరీరం తల్లడిల్లిపోతోంది. దీంతో మనిషి నీరసించిపోతున్నాడు. రోగ నిరోధక శక్తి తగ్గి అనారోగ్యం పాలవుతున్నాడు.

దుమ్ము, ధూళి పీల్చుకోవడంతో..

తేమ వాతావరణంలో రాత్రుళ్లు దుమ్ము, ధూళి పైకి లేవదు. ఉదయం 10 అయిందంటే చాలు ఎండ వేడిమికి దుమ్ము, ధూళి పైకి లేస్తోంది. వాహనదారుల శ్వాసకోశంలోకి చేరుతోంది. దీనివల్ల శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, డస్ట్ అలర్జీ, గొంతునొప్పి, వాపు, అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్ (సీవోపీడీ) వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారం పదిరోజులైనా ఇబ్బందులు తగ్గడం లేదు.

ఇన్‌ఫ్లుయెంజా వైరస్ అనుకూలం

సహజంగా వేసవి వాతావరణంలో వైరస్ బలహీనంగా ఉంటుంది. కానీ విభిన్న వాతావరణంతో వైరస్ పుంజుకుంటోందని వైద్యులు తెలిపారు. ఫ్లూ, దగ్గు, జలుబు, న్యుమోనియా, బ్రాంకైటిస్, ఆస్తమా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు బాగా పెరిగాయని వైద్యులు వివరించారు. ఎండ, చలి, తేమ వాతావరణం ఒకేరోజు చోటుచేసుకోవడం వల్ల వైరస్‌కు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇన్‌ఫ్లుయెంజా శక్తివంతమైతే జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ వ్యాధులు తీవ్రమవుతాయని చెప్పారు.

వ్యాక్సిన్లు వేసుకోవడం ఉత్తమం

ఈ వాతావరణంలో ఆయాసం, దగ్గు వంటి ఇబ్బందులు మరింత పెరుగుతాయి. పెద్దలు, పిల్లలు ఇంటి వద్దే ఉండే ప్రయత్నం చేయాలి. ఎప్పటికప్పుడు తాజా ఆహారం తీసుకోవాలి. ఈగలు, దోమలు ముసిరే ప్రాంతాల్ని శుభ్రం చేసుకోవాలి. ముందు జాగ్రత్తగా ఫ్లూ వ్యాక్సిన్లు వేసుకోవడం ఉత్తమం.

\- డాక్టర్ ప్రశాంత్‌కుమార్, సీనియర్ జనరల్ ఫిజిషియన్, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి



200 మంది పోకిరీలకు జైలు శిక్ష

గణేశ్ ఉత్సవాల్లో ఆటకట్టించిన షీ టీమ్స్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం, శోభాయాత్రలో షీటీమ్స్ పోలీసులు మఫ్టీలో రంగంలోకి దిగి మహిళలు, చిన్నారులకు భద్రత కల్పించారు. డీసీపీ కవిత పర్యవేక్షణలో షీటీమ్స్ ఆధ్వర్యంలో సిటీ కమిషనరేట్ పరిధిలో 12 బృందాలతో పాటు, ప్రతి పీఎస్ నుంచి ఇద్దరు, ముగ్గురు సిబ్బంది చొప్పున సుమారు 200 మంది పోలీసులు పహారా కాశారు. మహిళల పట్ల వికృతచేష్టలకు పాల్పడిన 996 మంది పోకిరీలను పట్టుకున్నారు. జనసమ్మర్థ ప్రాంతాల్లో మహిళలు, యువతులు, బాలికలపై కొంత మంది పోకిరీలు, ఆకతాయిలు కావాలనే అసభ్యంగా ప్రవర్తించడం, తాకరానిచోట తాకడం, ఎవరూ చూడట్లేదనుకొని మహిళలపట్ల ఇష్టానుసారంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడుతుండటాన్ని షీటీమ్స్ పోలీసులు ఫొటోలు తీసి, వీడియోలతో సహా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిలో నేర తీవ్రతను బట్టి సాక్ష్యాధారాలతో సహా..

మిగతా 8వ పేజీలో..



భద్రతకు భరోసా..

పోకిరీలు, ఆకతాయిల వికృత చేష్టల వల్ల ఇబ్బందులు పడే బాధిత మహిళలు డయల్-100 లేదా సిటీ పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ నంబర్ 9490616555కు ఫోన్ చేయొచ్చు. బాధిత మహిళల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

\- ధార కవిత, డీసీపీ షీటీమ్స్



పండుగ ప్రయాణం

దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో నగరవాసులు సొంతూళ్లకు పయనం అవుతున్నారు. కేపీహెచ్‌బీ బస్టాప్ శుక్రవారం రాత్రి ప్రయాణికులతో ఇలా రద్దీగా మారింది.

గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

● ప్రణాళికలు సిద్ధం చేయండి : ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి రెండు రోజుల్లో సమర్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పారిశుధ్య విభాగం అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌ను ఆదేశించారు. జోనల్, అదనపు కమిషనర్లతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్కెట్‌ల వద్ద డస్ట్‌బిన్‌లు, వాణిజ్య ప్రాంతాల్లో లిట్టర్ బిన్‌లు ఏర్పాటు చేయాలని, జోనల్ కమిషనర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటర్‌బోర్డు, జీహెచ్ఎంసీ పూర్తిచేసిన పనులకు సంబంధించిన వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు జోనల్ స్థాయిలో కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలుకు వెళ్లినప్పుడు వాణిజ్య ప్రాంతాల వద్ద పారిశుధ్య నిర్వహణను పరిశీలించాలని, జీపీఎస్ అమర్చిన స్వచ్ఛ ట్రాలీల పనితీరును ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు.



లక్ష్మీగూడ హౌసింగ్‌బోర్డుకాలనీలో పూజలు చేసిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అడికె రాజు, బోలాసింగ్, మురారీ, రవి, రాజేష్ తదితరులు



గౌలిపురాలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



లాల్‌దర్వాజ సింహవాహిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి

ఘనంగా అమ్మవారి పూజలు

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, పలువురు అధికార, అనధికార ప్రముఖులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి



శ్రీరామకాలనీలో పూజలు చేస్తున్న మహిళలు



శ్రీరామకాలనీలో యంగ్ ఇండియన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం



గాయత్రీదేవీ అలంకరణలో ఉప్పుగూడ మహాకాళి మాతేశ్వరి అమ్మవారు



మేకలబండ నల్లపోచమ్మ ఆలయంలో మూలమంత్ర హోమం చేస్తున్న మహిళలు



తుల్జాపూర్‌లోని తుల్జాభవానీ అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ నేతలు అంబటి శ్రీనివాస్, సతీశ్‌సింగ్, విశాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీరామ్, వెంకటేశ్ తదితరులు

సైబరాబాద్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. శంకరపల్లి ఎస్‌హెచ్‌ఓ మహ్మద్ హబీబుల్లాఖాన్‌ను గచ్చిబౌలి స్టేషన్‌కు, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును ఆర్థిక నేరాల పరిశోధన విభాగానికి, గచ్చిబౌలి డీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను శంకరపల్లి స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, షాద్‌నగర్ డీఐ ప్రశాంత్‌ను రాజేంద్రనగర్ సీసీఎస్ విభాగానికి, ఆర్థిక నేరాల పరిశోధన విభాగం ఇన్‌స్పెక్టర్ నరహరిని కేశంపేటకు, మాదాపూర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ నరసయ్యను షాద్‌నగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా, షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణను మాదాపూర్ ట్రాఫిక్ స్టేషన్‌కు, మాదాపూర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ దాలినాయుడును షాద్‌నగర్ డీఐగా, సీసీఎస్ రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్‌ను మాదాపూర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, న్యాయవాది గర్వవిశాల్

● అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి



రవీంద్రభారతిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఇళ్లలోకి వరదనీరు

పహాడిషరీఫ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని పలు కాలనీలు, బస్తీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికే వరద రోడ్లపై ఏరులై పారుతోంది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి కొత్తపేట గ్రామం ఎస్సీ బస్తీలో భారీగా వరదనీరు పలు ఇళ్లలోకి చేరింది. ప్రతీ వర్షాకాలం ఇదే పరిస్థితి నెలకొంటుందని, సంబంధిత అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కొత్తపేట్ ఎస్సీకాలనీలో పారుతున్న వరదనీరు



రోడ్లపై భారీగా చేరిన వరదనీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

చెరువులను తలపించిన రహదారులు

కార్వాన్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం, రేతిబౌలి, మాసాబ్‌ట్యాంక్, ఆసిఫ్‌నగర్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరదనీరు రోడ్లపై చేరింది. రహదారులు చెరువులను తలపించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు మూడు గంటలపాటు ట్రాఫిక్‌జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ ట్రాఫిక్‌జామ్‌లో అంబులెన్స్‌లు కూడా ఇరుక్కుపోయాయి. ఎక్కడ చూసినా ట్రాఫిక్ పోలీసులు కనబడకపోవడంతో స్థానికులే ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అత్తాపూర్-రాజేంద్రనగర్ మార్గంలో స్తంభించిన ట్రాఫిక్

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్-రాజేంద్రనగర్ మార్గంలో రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. అత్తాపూర్ పిల్లర్ నంబర్.125 వద్ద ఓ లారీ పాడై రోడ్డుపై ఆగిపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



స్తంభించిన ట్రాఫిక్

తహసీల్దార్‌ను సన్మానించిన రేషన్‌డీలర్లు

పహాడిషరీఫ్ అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇందిరాదేవిని రేషన్‌డీలర్ల సంఘం ప్రతినిధులు బడంగ్‌పేటలోని మండల కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, బాలాపూర్ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు దూడల కృష్ణగౌడ్, ఇరువెంటి సురేష్‌గుప్తా, జెనిగె రమేష్ యాదవ్, దిండు శ్రీనివాస్‌గౌడ్, భీమిడి హర్షవర్ధన్‌రెడ్డి, భీమిడి దినేష్‌రెడ్డి, పి. భాగ్యలక్ష్మి, షాహీన్, ఇజాజ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సత్కరించిన రేషన్‌డీలర్లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

52వ రామాయణ మేళా ఘట స్థాపన ప్రారంభం

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో 52వ రామాయణ మేళా శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఘట స్థాపనతో మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్ రాఠీ మాట్లాడుతూ అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అక్టోబరు 12న ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగే శ్రీరామ రాజ్యాభిషేకం మహోత్సవం, రావణదహనం కార్యక్రమాల్లో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొనాలని కోరారు.

అగ్రసేన్ మహారాజ్ బోధనలు తెలంగాణలో ప్రముఖపాత్ర

● డీజీపీ జితేందర్

శంషాబాద్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): అగర్వాల్ సమాజ్ అగ్రసేన్ మహారాజ్ బోధనలు తెలంగాణ అభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషిస్తున్నాయని డీజీపీ జితేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని క్లాసిక్ కన్వెన్షన్‌హాల్‌లో శుక్రవారం అగ్రసేన్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ అనేక సామాజిక సేవలందిస్తుందని కొనియాడారు. మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ రక్తదాన శిబిరాలతో విభిన్న సాధికారత కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. సమాజ్‌లోని సభ్యులందరూ అగ్రసేన్ మహారాజ్ బోధనలకు కట్టుబడి ఉండడం సంతోషకరమన్నారు. అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ కమ్యూనిటీ కార్యక్రమాల అమలుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అగర్వాల్ సంఘం 1998లో స్థాపించబడిందన్నారు. తమ సంఘం ద్వారా వివిధ రకాల సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.



డీజీపీ జితేందర్‌ను సన్మానిస్తున్న అగర్వాల్ సమాజ్ సభ్యులు

విదేశాల్లో చదువు.. గోవా నుంచి డ్రగ్స్ దందా

● నగరంలో గంజాయి, ఓజీ వీడ్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలుమార్లు జైలుకు వెళ్లినా తీరుమార్చుకోకుండా గంజాయి, ఓజీ కుష్ విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర పెడ్లర్‌ను మహేశ్వరం ఎస్‌ఓటీ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఇతడి నుంచి గంజాయితోపాటు ఖరీదైన ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముంబై బాంద్రావెస్ట్‌కు చెందిన రోమీ భరత్ కళ్యాణి అలియాస్ రోమి(40) కొంతకాలంగా గంజాయి దందా చేస్తున్నాడు. పదోతరగతి వరకు ముంబైలో చదువుకున్న ఇతడు ఇంటర్ థాయ్‌లాండ్, ఉన్నత విద్య అమెరికా, దుబాయ్‌లో పూర్తి చేశాడు. విదేశాల్లో చదువుకున్న ఇతడు డ్రగ్స్‌కు అలవాటయ్యాడు. ఇండియాకు తిరిగి వచ్చి రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయడం ప్రారంభించాడు. డ్రగ్స్‌కు బానిసైన ఇతడు కొనుగోలు చేయడంతో పాటు అవసరమున్న వారికి ఎక్కువ ధరకు డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. ఇతడు కేరళకు చెందిన టోబీ నుంచి డ్రగ్స్, గంజాయి తక్కువ ధరకు కొని, నగరంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. గంజాయి విక్రయిస్తున్న ఇతడిని ముంబై బాంద్రా పోలీసులు 2004లో అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి యత్నించిన ఇతడిపై 2013లో ముంబై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. దాంతో రోమీ తన మకాం గోవాకు మార్చాడు. గోవాలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇతడిని అంజునా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నగరంలో గంజాయి విక్రయాలు చేస్తున్న ఇతడిని ఈ ఏడాది పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి ఆగస్టులో బెయిల్‌పై వచ్చిన ఇతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో తిరిగి దందా ప్రారంభించాడు. బెంగళూరు గోవా, పూణే తదితర ప్రాంతాలకు వెళ్లి గంజాయి, ఖరీదైన ఓజీ కుష్‌ను కొనుగోలు చేశాడు. ప్రైవేటు బస్సులో నగరానికి చేరుకున్న ఇతడు కస్టమర్లకు సరఫరా చేసేందుకు తుక్కుగూడ వైపునకు వెళుతుండగా మహేశ్వరం ఎస్‌ఓటీ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఇతడి నుంచి 1.50 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



గంజాయితో రోమీ భరత్ కళ్యాణి



బీజేపీ సభ్యత్వ నమోదులో నర్సింహారెడ్డి

ప్రతీ బూత్‌లో 200 సభ్యత్వ నమోదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒక్కో పోలింగ్ బూత్‌లో 200 మందితో బీజేపీ సభ్యత్వం చేయించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు షాబాద విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేయించారు. 8800002024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించి, నమో యాప్ ద్వారా బీజేపీ సభ్యత్వం ఇప్పించారు. కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, నాయకులు ఎస్.మల్లారెడ్డి, కార్పొరేటర్లు మోండ్ర సంగీత, తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, రాష్ట్ర నాయకుడు కాడెం సుధాకర్ పాల్గొన్నారు.



ఓటరు జాబితా వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి

రాజేంద్రనగర్ ఓటర్లు 6,17,679 మంది

● నూతనంగా 12 పోలింగ్ బూత్‌లు

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓటర్లు 6,17,679 మంది అని రాజేంద్రనగర్ ఆర్డీవో కొప్పుల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా ఏర్పాటుపై శుక్రవారం ఉప్పర్‌పల్లిలోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పురుష ఓటర్లు 3,19,700 మంది ఉండగా, మహిళలు 2,97,944 మంది, ఇతరులు 35 మంది ఉన్నారని తెలిపారు. 12 పోలింగ్ బూత్‌లు పెరిగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఎన్.ధనుంజయ, బొక్క బాల్‌రెడ్డి, ఆదిరాల శ్రీనివాస్, తాహేర్ పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించండి : బీజేపీ

గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 10 నుంచి 15 శాతం దొంగ ఓట్లు ఉన్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొక్క బాల్‌రెడ్డి ఆరోపించారు. పూర్తి స్థాయిలో సర్వే చేసి దొంగ ఓట్లను తొలగించాలని కోరారు.



ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి తదితరులు

ఇంద్రారెడ్డి ఆశయాలను సాధిస్తా

● బీఆర్ఎస్ యువ నేత కార్తీక్‌రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ, తెలంగాణ ఉద్యమకారుడిగానూ దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా ప్రజల కోసం ఎంతో పరితపించారని, ఆయన ఆశయాలను సాధిస్తానని తనయుడు, బీఆర్ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుడు కొలన్ సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి జయంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, మైలార్‌దేవుపల్లి డివిజన్ యువ నేత అక్కెం రాఘవేందర్ యాదవ్, మైనారిటీ నాయకుడు అబ్దుల్ ముఖీద్ చందా, నాయకులు జాలిగం చిత్తారి, ఎస్.వెంకటేశ్, నోముల రాము యాదవ్, బండి రాజేశ్‌యాదవ్, పచ్చ శ్రీనివాసులు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామ ఇంద్రపాల్‌రెడ్డి ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

రాజకీయంగా వెనకబడిన మేరుసంఘం

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 లక్షలకు పైగా మేరు కులస్థులు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కార్పొరేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వలేదని, దీంతో మేరుజాతి రాజకీయంగా వెనకబడి పోయిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూల శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎంపీ మల్లు రవిని ఆయన కలిశారు. కాంగ్రెస్ పార్టీలో 33 సంవత్సరాలుగా పనిచేస్తున్న పోల్కం శ్రీనివాస్‌కు కార్పొరేషన్ ఛైర్మన్ లేదా రాజ్యసభ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు వి.శివకుమార్, పి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సదుపాయాలకు నిధులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చాంద్రాయణగుట్ట నల్లవాగు హిందూ శ్మశానవాటిలో మౌలిక సదుపాయాల కోసం రూ.15.90 లక్షలు మంజూరయ్యాయని భాగ్యనగర్ బ్యాగరి సంఘం అధ్యక్షుడు పేరోజి సాయినాథ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి.వెంకన్న, ఈఈ షేక్ సలావుద్దీన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సంగీత

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ డివిజన్ పరిధిలోని సిరిమల్లెనగర్, జలాల్‌బాబానగర్‌లో సీసీ రోడ్ల పనులను కార్పొరేటర్ మోండ్ర సంగీత శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ.రాజు, నాయకులు బీట్కూరి సిద్దేశ్వర్, ఎల్.వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులను ప్రేమగా చూసుకోవాలి

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలని గ్రేస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గ్రేస్ సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లు, వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పటాకుల అక్రమ నిల్వ.. లైసెన్స్ లేకుండా విక్రయం

● వ్యాపారి అరెస్ట్ ● రూ. 15 లక్షల విలువైన పటాకులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పటాకులను అక్రమంగా నిల్వ ఉంచడంతో పాటు లైసెన్స్ లేకున్నా విక్రయాలు చేస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. షాహినాయత్‌గంజ్ ప్రాంతానికి చెందిన శ్యామ్‌యాదవ్ ఖేరియావాలే(49) బేగంబజార్‌లో దుకాణం నిర్వహిస్తున్నాడు. దీపావళి పండగకు విక్రయించేందుకు ఫీల్‌ఖానా తేజ్‌టవర్స్ షాపునంబర్.25 సెల్లార్ గోదాంలో పెద్ద మొత్తంలో పటాకులు కొనుగోలు చేశాడు. ఎలాంటి అనుమతులు లేకుండా నివాస ప్రాంతాల మధ్య నిల్వ చేశాడు. టోకెన్ విక్రయాలు ప్రారంభించాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఫీల్‌ఖానాలోని గోదాంపై దాడి చేశారు. అతడి నుంచి రూ. 15 లక్షల విలువైన బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బాణాసంచాను బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న పటాకులతో నిందితుడు



షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీనటి వైష్ణవీ చైతన్య

నల్లగండ్లలో 'చందన బ్రదర్స్ 'ప్రారంభోత్సవం

గచ్చిబౌలి, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ నూతన షోరూమ్ శుక్రవారం నల్లగండ్లలో ప్రారంభమైంది. సినీనటి వైష్ణవీ చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించి వస్త్రాలను పరిశీలించి సందడి చేశారు. షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన ప్రతిచోటా తమ షోరూమ్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. వినియోగదారుల అభిరుచికనుగుణంగా సరసమైన ధరల్లో అన్నిరకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దసరా, దీపావళి సందర్భంగా అన్నిరకాల వస్త్రాలపై 51శాతం వరకు తగ్గింపు, ప్రతి రూ.వెయ్యి కొనుగోలుపై కూపన్, లక్కీడ్రా, బంపర్‌డ్రాలో ప్రతిరోజూ బంగారం గెలుపొందవచ్చని ఆయన చెప్పారు.

చట్టసభలను సందర్శించిన ఆస్ట్రేలియా మంత్రులు



ఆస్ట్రేలియా మంత్రులను సన్మానిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బండ ప్రకాశ్, గాంధీ

హైదరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాకు చెందిన మంత్రుల బృందం శుక్రవారం శాసన సభ, మండలిని సందర్శించింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు ఆస్ట్రేలియా బృందానికి రెండు చట్టసభలను చూపించారు. అనంతరం వారిని మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఘనంగా సత్కరించారు.

నకిలీ పత్రాలతో భూముల ఆక్రమణ

● బీఆర్ఎస్ నాయకురాలి సహా ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బతికున్న వారు చనిపోయినట్టు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, కాలనీల్లో ఖాళీగా ఉన్న కోట్ల రూపాయల విలువ చేసే భూములను దౌర్జన్యంగా ఆక్రమించి విక్రయిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఆమె ముఠా సభ్యులను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు పద్మజారెడ్డి అలియాస్ కుత్బుల్లాపూర్ పద్మ(32), ఆమె సోదరి నాగిరెడ్డి కోమలాకుమారి(49), నరేందర్ అలియాస్ నందు(25), వత్రం రవిశంకర్(38), మేకల హరీష్(36), రేపాక కరుణాకర్(34) ముఠాగా ఏర్పడ్డారు. వీరు గత కొన్నేళ్లుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో కోట్లాది రూపాయలు విలువచేసే భూములను కొల్లగొట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్‌లో ప్లాట్ నంబర్ 147లో పాతబస్తీ, ఉప్పుగూడకుచెందిన లెండ్యాల సురేష్ అనే వ్యక్తికి 200గజాల స్థలం ఉంది. 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశాడు. ఖాళీగా ఉండడంతో దానిపై పద్మజారెడ్డి కన్నుపడింది. 1992లో భూ యజమాని చనిపోయినట్టు రికార్డులు సృష్టించి కుత్బులాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది సాయంతో తన సోదరికి విక్రయించినట్టు రికార్డులు సృషించారు. ఫిర్యాదు రావడంతో పోలీసులు పద్మజారెడ్డి, ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఠా సభ్యులు జూబ్లీహిల్స్‌లో వెయ్యిగజాల స్థలం, ఏపీలో మరో స్థలం, అనేక ప్రాంతాల్లో భూములను కబ్జాచేయడానికి డాక్యుమెంట్లను సిద్ధం చేసుకున్నట్టు తేలింది. నిందితుల నుంచి 8 నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకుని ముఠా సభ్యులు ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు.

'డిజైన్ డెమోక్రసీ' షురూ



ఇంటీరియర్ డిజైన్‌లో భాగమైన ఉత్పత్తులు, డిజైన్లు, మెటీరియల్స్ పట్ల అవగాహన కల్పిస్తూనే, ఈ రంగంలో వస్తున్న మార్పులపై క్రియేటర్లు, ప్రొఫెషనల్స్, డిజైన్ ప్రేమికులకు అవగాహన కల్పించే డిజైన్ డెమోక్రసీ ఫెస్టివల్ శుక్రవారం హైటెక్స్‌లో ప్రారంభమైంది. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, ఫిక్కీ ఫ్లో మాజీ చైర్‌పర్సన్ పింకీరెడ్డి, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు హాజరయ్యారు. సుమారు 50 మంది ఇంటీరియర్ డిజైనర్లు, బ్రాండ్లు తమ స్టాళ్లను ఏర్పాటు చేశారు. డిజైన్ డెమోక్రసీ వ్యవస్థాపకురాలు పల్లికా శ్రీవాస్తవ్ పాల్గొన్నారు. -హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి)

బెయిల్‌పై సునీల్‌యాదవ్ విడుదల

సైదాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న సునీల్‌యాదవ్ శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు గంగిరెడ్డి, శంకర్‌రెడ్డి జైల్లోనే ఉన్నారు.

ఉప్పల్ కికెట్ మ్యాచ్‌కు పటిష్ట బందోబస్తు

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో ఈనెల 12న జరిగే ఇండియా- బంగ్లాదేశ్ క్రికెట్ మ్యాచ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం డీసీపీలు, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సీపీ సమీక్ష నిర్వహించారు. నకిలీ టికెట్లు విక్రయించే వారిపై నిఘా ఉంచామని, ఎలాంటి వదంతులను నమ్మొద్దని సూచించారు.

నగరంలో నేడు

● 'మరిచిపోయిన ఆహారాలు' పేరిట అక్షయకల్ప ఆర్గానిక్ సంస్థలో ఉదయం 10.30కు ప్రత్యేక కార్యక్రమం.

● తెలంగాణ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం సాయంత్రం 4.30 గంటలకు టీహబ్‌లో జరగనుంది.

యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోండి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొన్ని యూట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా తన పరువుకు భంగం కలిగించేలా అసభ్య కంటెంట్‌తో ప్రచారం చేశాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని మిత్రశర్మ సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యూట్యూబర్ హర్షసాయి పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పలు యూట్యూబ్ చానళ్లు, సోషల్‌మీడియా ఖాతాల ద్వారా తనపై అసభ్యకరంగా ప్రచారం చేశాయని, కొన్ని స్క్రీన్‌షాట్‌లను ఆధారంగా ఇస్తూ వాటిపై చర్యలు తీసుకోవాలని మిత్రశర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో నీటి ఎద్దడి

- సరఫరాలో కోత విధించిన జలమండలి

బర్కత్‌పుర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వేస్టేషన్‌లో నీటి ఎద్దడి నెలకొంది. భారీ వర్షాలతో జలాశయాలు నిండుగా ఉన్నా.. సరిపడా నీటిని వాటర్‌బోర్డు సరఫరా చేయడం లేదు. నీటి సరఫరాను పూర్తిగా తగ్గించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు గతంలో నిత్యం 9 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా జరిగేది. నెలరోజులుగా 3 లక్షల లీటర్లే సరఫరా జరుగుతుండడంతో బోగీల క్లీనింగ్ అంతంత మాత్రంగా జరుగుతోంది. చివరకు రైలు బోగీల ట్యాంకుల్లో నీటిని నింపడం కూడా తగ్గించారు.

దసరాలోపు ఫలితాలు ప్రకటించాలి

● ప్రజాభవన్ వద్ద జూనియర్ లెక్చరర్ అభ్యర్థుల ఆందోళన

బేగంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరాలోపు జూనియర్ లెక్చరర్ల తుది ఫలితాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బేగంపేట ప్రజాభవన్ వద్ద అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదలబోమని భైఠాయించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేయగా, ఆయన వెంటనే టీజీపీఎస్సీ చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడడంతో ఆందోళన విరమించారు.

ప్రజావాణికి 338 దరఖాస్తులు : ప్రజావాణికి శుక్రవారం 338 దరఖాస్తులు వచ్చాయి. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రామాంజనేయులు, ప్రధానకార్యదర్శిగా సునీల్‌రాజ్, కోశాధికారిగా నామాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మంచాల రవీందర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



తమ కుమార్తె మర్రి శ్రేయారెడ్డి-ఆదిత్యరెడ్డి వివాహానికి హాజరుకావాలంటూ శుక్రవారం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు. చిత్రంలో మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి.

-మల్కాజిగిరి (ఆంధ్రజ్యోతి)

13న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్



మాట్లాడుతున్న బండారు విజయలక్ష్మి

రాంనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహించే 'అలయ్-బలయ్'ను ఈనెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు అలయ్-బలయ్ ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లోని దత్తాత్రేయ నివాసంలో కార్యక్రమ నిర్వహణపై సమీక్ష జరిగింది. ఆమె మాట్లాడుతూ అలయ్-బలయ్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్లు జిష్ణుదేవ్‌వర్మ, గుర్మిత్‌సింగ్, విజయశంకర్, తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, పలువురు కేంద్రమంత్రులు, తెలంగాణ, ఏపీలకు చెందిన మంత్రులు, వివిధ పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అలయ్ బలయ్ కమిటీ సభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్, వెంకటరమణి, ప్రకాశ్‌రెడ్డి, రమేష్‌రామ్, బద్రీనారాయణ, గీతామూర్తి, పాపారావు, శేషసాయి, గిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ విజన్ అద్భుతం : గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న చౌరస్తాల్లో వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం ఆయన విజన్‌కు నిదర్శనమని బల్దియా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాల్లో ఒక్కటైన ఈ ప్రాంతంలో ప్రాజెక్టు గేమ్ చేంజింగ్‌గా మారుతుందని తెలిపారు. రూ.826 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుకు పాలనాపరమైన అనుమతులివ్వడంపై ధన్యవాదాలు తెలిపారు.

ఐఎస్‌బీ కృషి అభినందనీయం : కేంద్రమంత్రి జయంత్‌సింగ్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జయంత్‌సింగ్

రాయదుర్గం, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయమంత్రి జయంత్‌సింగ్‌చౌదరి కొనియాడారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో 'ఆరునెలల పూర్తి సమయం ఆన్ క్యాంపస్ ప్రోగ్రాం'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఐఎస్‌బీ నూతనంగా ప్రారంభించిన ఈ కొత్త ఐవెంచర్ విమ్మర్సివ్ ప్రోగ్రాంతో స్టార్టప్‌లకు మరింత బలం చేకూరుతుందన్నారు. మొదటిబ్యాచ్‌లో 40 శాతంకంటే ఎక్కువగా మహిళలు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. కాగా, 'ఆరునెలల ఫుల్‌టైం క్యాంపస్ కార్యక్రమం'లో 51మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల, ఐవెంచర్ డైరెక్టర్ భగవాన్ చౌదరి, ఐఎస్‌బీ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

జప్తు చేసిన వాహనాల వేలం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో పోలీసులు జప్తు చేసిన, పట్టుబడిన నిందితులు వదిలేసిన 1212 వివిధ రకాల వాహనాలను వేలం వేయనున్నట్లు సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. వాహనాలు తీసుకెళ్లాలనుకున్నవారు సరైన ఆధారాలతో బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల వివరాలు గోషామహల్ పోలీస్ స్టేడియం ఆఫీసులో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సీఎం ఇంటి వద్ద సాష్టాంగ నమస్కారం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టీచర్ ఉద్యోగాల నియామకంలో ఎస్సీల వాటాను పక్కన పెట్టాలంటూ మాదిగ దండోరా నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద సాష్టాంగ నమస్కారం చేశారు. ఎస్సీల వాటా తేల్చకుండా టీచర్ ఉద్యోగాల భర్తీ చేయొద్దని దండోరా నాయకుడు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీశ్‌మాదిగ కోరారు.

ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరు మృతి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో గతనెల 30న గడ్డిఅన్నారం డివిజన్ కోదండరానగర్ కాలనీ గౌతంనగర్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన కుటుంబంలో మరొకరు మృతిచెందారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్ (60), లత (55) దంపతులకు సందీప్ (30), సాయి స్వరూప్ (28), వంశీకృష్ణ (26) ముగ్గురు సంతానం. వెంకటేశ్వరప్రసాద్ స్థానికంగా కిరాణా దుకాణం నడుపుతుండగా, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. డబ్బులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో గతనెల 30న ఐదుగురు కుటుంబసభ్యులు పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో ఇప్పటికే చిన్నకుమారుడు వంశీకృష్ణ మృతిచెందగా, శుక్రవారం పెద్ద కుమారుడు సందీప్ కన్నుమూశాడు. మిగతా ముగ్గురు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్నేహితుడే హంతకుడయ్యాడు..

● ప్రేమను తిరస్కరించిందని కక్ష.. నిందితుడి అరెస్ట్, రిమాండ్

మియాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దీప్తిశ్రీనగర్‌లో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మియాపూర్ సీబీఆర్ ఎస్టేట్స్‌లో ఉంటున్న స్పందనకు రెండేళ్ల క్రితం వినయ్‌కుమార్‌తో వివాహమైంది. కొంతకాలం బాగానే ఉన్నా ఆ తర్వాత మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. స్పందన తల్లివద్ద అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. ఆమెను తన క్లాస్‌మేట్ మనోజ్‌కుమార్ అలియాస్ బాలు ప్రేమిస్తున్నాడు. స్పందన, మనోజ్ ఓ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఆమె భర్తకు దూరంగా ఉండటంతో తనను ప్రేమించాలని మనోజ్ వేధించాడు. ఆమె తిరస్కరించడంతో మనస్తాపం చెంది స్పందనపై కక్షపెంచుకున్నాడు. గతనెల 30న ఇంట్లో గాఢనిద్రలో ఉన్న ఆమె ముఖంపై బండరాయితో మోది, స్క్రూడ్రైవర్‌తో పొడిచి దారుణంగా హత్యచేసి పారిపోయాడు. సీసీ ఫుటేజీ, సెల్‌టవర్ లొకేషన్ ఆధారంగా మనోజ్‌కుమార్ అలియాస్ బాలు స్పందనను హతమార్చినట్లు నిర్ధారించి పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

824 నివాసాలు.. 149 కూల్చివేతలు

(5వ పేజీ తరువాయి)

వివిధ కమర్షియల్ బిల్డింగుల దగ్గరకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిని ముట్టడించి వాగ్వాదానికి దిగడంతో వారు అక్కడి నుంచి తిరిగి వెళ్లినట్లు సమాచారం. తమకు మూసీ ఇబ్బందులేమీ లేవని, అనవసరంగా వచ్చి ఇబ్బందులు పడితే బాగుండదని హెచ్చరించినట్లు తెలిసింది. కాగా, రివర్‌బెడ్ కింద ఉన్న నివాసగృహాలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కమర్షియల్ భవనాల యజమానులకు ఇవ్వకపోతుండడంతో చాలామంది ఆసక్తి చూపించడం లేదు. తప్పనిసరిగా ఖాళీ చేయాలంటే తమకు నష్టపరిహారం ఇవ్వాలని యజమానులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాతనే అధికారులు కమర్షియల్ భవనాల జోలికి వెళ్లనున్నారు.

ఉన్నతాధికారుల సమీక్షతో పరేషాన్

మూసీనది ప్రక్షాళన.. రెవెన్యూ అధికారులకు కత్తిమీద సాములాగా మారింది. ఓవైపు రివర్‌బెడ్ మార్కింగ్ చేసిన ఇళ్లను సకాలంలో కూల్చివేసి, అక్కడివారిని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలించాలని, మరోవైపు కమర్షియల్ బిల్డింగులను కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తుండడంతో పరేషాన్ అవుతున్నారు. మూసీనదీ తీరం నుంచి ఖాళీ చేయాలని కోరుతున్నప్పటికీ చాలామంది ఆసక్తి చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిర్వాసితులతో సమావేశాలు, తరలింపు ప్రక్రియ, ఉన్నతాధికారుల సమీక్ష, స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో రెండు వారాలుగా సతమతమవుతున్నామని పలువురు తహసీల్దార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మొదటి దశలోని రివర్‌బెడ్ పరిస్థితి ఈ విధంగా ఉంటే.. రెండో దశలో చేపట్టనున్న బఫర్‌జోన్ కూల్చివేతలు ఎలా ఉంటాయోనని ఇప్పటి నుంచే వారు కలవరపడుతున్నారు. మొత్తంగా మూసీ సుందరీకరణ ప్రక్రియ నిర్వాసితులతో పాటు అధికారులను సైతం హడలెత్తిస్తోంది.

జోరు వాన

(5వ పేజీ తరువాయి)

భీకరవర్షంతో నగరం వణికిపోయింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి.

పోటెత్తిన వరద..

మెహిదీపట్నం, గోల్కొండ, మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, అమీర్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, మూసారంబాగ్, మలక్‌పేట్, ఎంజే మార్కెట్, నాంపల్లి, లక్డీకాపూల్‌లో కురిసిన వర్షంతో రోడ్లపై వరద పోటెత్తింది. ఎల్‌బీనగర్, అమీర్‌పేట్, సికింద్రాబాద్, సనత్‌నగర్, తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

భారీగా ట్రాఫిక్ జామ్



నగరంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సాయంత్రం సమయంలో ఉద్యోగులు ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్తున్నప్పుడు కురిసిన వానతో మెహిదీపట్నం, అత్తాపూర్, ఆరాంఘర్, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్, టోలీచౌకీ, గచ్చిబౌలితో పాటు ఎంజే మార్కెట్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, నాగోలులో వాహనాలు నిలిచిపోయాయి. కాగా, సాయంత్రం కురిసిన వర్షం నుంచి తేరుకోక ముందే రాత్రి మరోసారి పడిన వర్షంతో మళ్లీ ట్రాఫిక్ స్తంభించింది. రాగల రెండు రోజులపాటు కూడా నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్పారు.

200 మంది పోకిరీలకు జైలు శిక్ష

(5వ పేజీ తరువాయి)

న్యాయస్థానంలో హాజరుపరిచారు. 200 మంది పోకిరీలకు న్యాయస్థానం 3 రోజుల జైలు శిక్ష, రూ. 1050లు జరిమానా విధించినట్లు షీ టీమ్స్ డీసీపీ కవిత వెల్లడించారు. మిగిలిన పోకిరీలకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వీడియోలను చూపించి కౌన్సెలింగ్ నిర్వహించి కఠినమైన వార్నింగ్ ఇచ్చినట్లు తెలిపారు.